

రూ.2,44,348 విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి స్థానిక వ్యాపారులు వీర్ల సూరిబాబు, చక్రరావు, రాంబాబు శనివారం రూ.2,44,348 విరాళాన్ని దేవస్థానం ఈఓ సుబ్బారావుకు అందజేశారు.



సుదర్శన హోమానికి రూ.లక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో సుదర్శన హోమానికి నముడూరి వెంకట సత్య సోమయాజులు, సురేషా దంపతులు, కుటుంబ సభ్యులు (చెన్నై) శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 9,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.85 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

శృంగార వల్లభుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో వెలసిన స్వయంభూ శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సుమారు 9 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారని, ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. స్వామివారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల టికెట్లు, అన్నదాన విరాళాల రూపంలో స్వామి వారికి రూ.1,74,675 ఆదాయం సమకూరిందని ఈఓ చెప్పారు. 2,500 మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

బాలిక వైద్యానికి రోటరీ సాయం



వీరబాబుకు చెక్కు అందిస్తున్న రోటరీ సెంట్రల్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): బాణసంచా ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ బాలిక వైద్యానికి రోటరీ సెంట్రల్ క్లబ్ ఆర్థిక సహాయం అందజేసింది. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరబాబు కుమార్తె జాహ్నవి దీపావళి పండగ నాడు బాణసంచా కాలుస్తుండగా ప్రమాదానికి గురైంది. 70 శాతం కాలిన గాయాలతో కాకినాడలోని క్యాపిటల్ ఆసుపత్రిలో చేరింది. నిరుపేద అయిన వీరబాబుకు రోటరీ సెంట్రల్ క్లబ్ అండగా నిలిచింది. అతడి కుమార్తె వైద్యానికి ఎపెక్స్ కంపెనీ అధినేత కేఎస్ మూర్తి రూ.లక్ష, రోటరీ సెంట్రల్ ట్రస్ట్ నుంచి మరో రూ.2 లక్షలు విడుదల చేసింది. క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ఈ విషయం తెలిపారు. మొత్తం రూ.3 లక్షల చెక్కును శనివారం వీరబాబుకు అందించారు. ఆసుపత్రి యాజమాన్యం ఉచితంగా వైద్యం అందించేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు. ఇప్పటి వరకూ జాహ్నవి వైద్యానికి రూ.6 లక్షలు ఖర్చయ్యిందని, మరో రెండు నెలలు పాటు వైద్యం చేయాల్సి ఉంటుందని, దాతలు సహకరించాలని ఆయన కోరారు. సహాయం చేయాలనుకునేవారు 98482 10897 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

హైస్కూల్ ప్లస్ కొనసాగించాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఇంటర్మీడియెట్ విద్య అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌ను యథావిధిగా కొనసాగించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని, ప్లస్‌టూ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలున్నందున ల్యాబ్ నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలని, మండలానికో ప్లస్‌టూ కో ఎడ్యుకేషన్ పాఠశాల ఉండాలని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువనే సాకుతో ఈ వ్యవస్థను రద్దు చేయడం సరి కాదని పేర్కొన్నారు.

జీపీటీలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ (జీపీటీ) కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి కొండలరావు శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు ఇంటర్, డిప్లొమా లేదా డిగ్రీ ఉత్తీర్ణులై, 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు వారు అర్హులన్నారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సుకు పదో తరగతి ఆపైన ఉత్తీర్ణులై, 18 నుంచి 40 సంవత్సరాల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామని, వివరాలకు 90107 37998 నంబరులో సంప్రదించాలని కోరారు.



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు



పిఠాపురంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ వంగా గీత తదితరులు

జననేతకు జేజేలు

- ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు
- సేవలతో అభిమాన నేతకు నీరాజనం
- ప్రజల గుండెల్లో చెక్కుచెదరని అభిమానం
- జిల్లావ్యాప్తంగా కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికార పార్టీ, విపక్షం అనే వ్యత్యాసం చూపకుండా నిత్యం పేదల పక్షాన నిలిచిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల గుండెల్లో ఉన్న ఆదరాభిమానాలు ఏమాత్రం చెక్కుచెదరలేదు. ముఖ్యమంత్రిగా ఐదేళ్ల పాటు ఆయన చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ఇప్పటికీ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన ఆ జననేత పుట్టిన రోజు వేడుకలే దీనికి సాక్షిగా నిలిచాయి. నగరాలు, పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ప్రజలు జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో పార్టీ నేతలు, అభిమానులు నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడం కనిపించింది. పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన జగన్‌కు ప్రజలు నీరాజనం పలికారు. వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ కో ఆర్డినేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎక్కడికక్కడ తమ అభిమాన నేత జగన్ పుట్టిన రోజును వేడుకగా నిర్వహించారు. పెద్ద ఎత్తున కేక్‌లు కట్ చేసి, అందరికీ పంచి, సంబరాలు చేసుకున్నారు. నిరుపేదలకు దుప్పట్లు, రోగులకు పండ్లు పంపిణీ చేసి, తమ ప్రియ నేతకు సేవా హారతి పట్టారు

- **వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో..**

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆధ్వర్యాన జగన్ పుట్టిన రోజు వేడుకలను పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలు కూడా అమలు చేసిన ఏకైక నాయకుడు దేశంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. చెప్పిందే చేస్తా, చేయగలిగిందే చెప్తా అని ధైర్యంగా చెప్పే నాయకుడని కొనియాడారు. ఒక నాయకుడి వెనుక ఉన్నామంటే తల ఎత్తుకునే తిరిగేలా ఉండాలని, ఒక ధైర్యం వెనకాల ఉన్నామనే ఫీలింగ్ ఉండాలని, అవన్నీ ఒక్క జగన్‌మోహన్‌రెడ్డిలోనే ఉన్నాయని అన్నారు.

- **పిఠాపురంలో..**

మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీతా విశ్వనాథ్ ఆధ్వర్యాన గొల్లప్రోలు మార్కెట్ సెంటర్‌లో జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పిఠాపురంలోని పార్టీ కార్యాలయంలో కూడా కేక్ కట్ చేసి, నాయకులు, కార్యకర్తలకు పంచారు. స్థానిక సౌజన్య దివ్యాంగుల ట్రస్ట్ ఆశ్రమంలో దివ్యాంగులకు వంగా గీత దుప్పట్లు పంపిణీ చేశారు.

- **పెద్దాపురంలో..**

కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యాన పార్టీ పెద్దాపురం నియోజకవర్గ కార్యాలయంలో జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. సామర్లకోట ప్రసన్నాంజనేయ ఆలయం వద్ద దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి దవులూరి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సిరి మానసిక కేంద్రంలోను, ఆస్పత్రిలోను రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, రాష్ట్ర అయ్యెరక సంఘ చైర్మన్ ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుతో పాటు కిర్లంపూడి మండల నాయకులు జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే, గిరిబాబు ఆధ్వర్యాన పార్టీ నేతలు కిర్లంపూడిలో కూడా జగన్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు సుమారు 250 మంది మహిళలకు చీరలు, ఏలేశ్వరంలో చిరు వ్యాపారులకు, పేదలకు పండ్లు పంపిణీ చేశారు.
- జగ్గంపేట, గోకవరం గ్రామాల్లో మాజీ మంత్రి, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం కేక్ కట్ చేశారు. వంద మంది మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. జగ్గంపేటలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కేక్ కట్ చేసి, అభిమానులు, పార్టీ నాయకుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు.
- కాకినాడ నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ఆధ్వర్యాన జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ అనుబంధ విభాగాల నాయకులు రావూరి వెంకటేశ్వరరావు, అల్లి రాజబాబు, మాజీ కార్పొరేటర్లు, అభిమానులు పాల్గొన్నారు.



తుని మండలం ఎస్.అన్నవరంలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యాన..

మాజీ మంత్రి, పార్టీ తుని నియోజకవర్గ కో ఆర్డినేటర్ దాడిశెట్టి రాజా ఆధ్వర్యాన జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు పండగలా జరిగాయి. తుని రూరల్ మండలం ఎస్.అన్నవరంలో జరిగిన వేడుకల్లో రాజా కేక్ కట్ చేసి, అందరికీ పంచారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాల నుంచి పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు జగన్‌పై అభిమానంతో పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

ఎయిర్‌పోర్టుకు భూములివ్వం



తహసీల్దార్‌కు వినతిపత్రాలు ఇస్తున్న రైతులు

- బెండపూడి సదస్సులో రైతుల స్పష్టీకరణ
- తహసీల్దార్‌కు 230 మంది వినతిపత్రాలు

తొండంగి: పరిసర గ్రామాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి తమ భూములు ఇచ్చేది లేదని బెండపూడిలో శనివారం జరిగిన సదస్సులో రైతులు మరోమారు స్పష్టం చేశారు. ఈ మేరకు అన్నవరం, బెండపూడి, పీఈ చిన్నాయపాలెం గ్రామాల రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన దాదాపు 230 మంది రైతులు తహసీల్దార్ మురార్జీకి విడివిడిగా వినతిపత్రాలు సమర్పించారు. ఆ భూములను ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటూ, జీవనం సాగిస్తున్నామని, వాటిని ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఇవ్వబోమని పేర్కొన్నారు. ఈ భూములు తీసుకుంటే వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద్దుకూరి వెంకట సుబ్బారావు చౌదరి, ప్రధాన కార్యదర్శి రాయవరపు ఆనంద్, రైతులు పాల్గొన్నారు. కాగా, ఈ సదస్సులో సర్వే కోసం 20, మ్యుటేషన్ల కోసం 27 చొప్పున దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ మురార్జీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజారావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవదంపతులు కూడా వారి బంధుమిత్రులతో కలసి సత్యదేవుని ఆలయానికి వచ్చారు. వీరందరూ వ్రతమాచరించి సత్యదేవుని దర్శించుకున్నారు. వీరికి ఇతర భక్తులు తోడవ్వడంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.

ఘనంగా ప్రాకార సేవ

ఆలయ ప్రాంగణంలో సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు తిరుచ్చి వాహనంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేంచేయించి, అర్చకులు పూజలు చేశారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి ప్రాకార సేవను ప్రారంభించారు. ఆలయ ప్రాకారంలో నాలుగు దిక్కులా కొబ్బరి కాయలు కొట్టి ప్రాకార సేవ కొనసాగించారు. తరువాత స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాదులు సమర్పించి, తిరిగి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సత్యదేవుడిని, అమ్మవారిని టేకు రథంపై ఆలయ ప్రాకారంలో ఘనంగా ఊరేగించనున్నట్లు అధికారులు తెలిపారు.



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు, నవదంపతులు

సంక్షోభంలో సమతూకమా!

- సమీకరణాలతో డీసీ చైర్మన్ల నియామకం
- అనుభవాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- తూర్పు డెల్టా జనసేనకు.. మధ్య డెల్టా టీడీపీకి..
- సాగునీటి యాజమాన్యంపై అన్నదాతల పెదవి విరుపు



సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టా సంక్షోభంలో ఉంది. మూడు పంటలు పండే ఈ ప్రాంతంలో ఖరీఫ్, రబీ వరిసాగు చేయలేని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. పంట కాలువలు అధ్వానంగా.. మురుగునీటి కాలువలు పూడుకుపోయి నీటి యాజమాన్యం అస్తవ్యస్తంగా తయారైంది. సిబ్బంది అనుభవ లేమి, నిర్లక్ష్యంతో డెల్టా వ్యవస్థ ఇలా తయారైంది. కనీసం పూడిక తొలగింపునకు సైతం ప్రభుత్వం నిధులు ఇవ్వని దుస్థితి. ఈ సమయంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్లుగా అనుభవం ఉన్న వారిని, సమర్థులను ఎంపిక చేసి ఉంటే సరిపోయేది. కానీ, రాజకీయ పార్టీ.. సామాజిక వర్గాలు.. ప్రాంతాల ప్రాతిపదికన కొత్తవారిని ఎంపిక చేయడం, వారికి డెల్టా వ్యవస్థపై పెద్దగా అవగాహన లేకపోవడం రైతులను నిరుత్సాహానికి గురి చేస్తోంది.

గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు సాఫీగా సాగిపోయాయి. టీడీపీ అధిష్టానం.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు నిర్ణయించిన వారిని చైర్మన్, వైస్ చైర్మన్లుగా డిస్ట్రిబ్యూటరీ కమిటీల (డీసీ) చైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పదవుల పంపిణీలో అసంతృప్తులు తలెత్తకుండా గోదావరి డెల్టాను తూర్పు, మధ్య డెల్టాలుగా విభజించి, చైర్మన్, వైస్ చైర్మన్లు ఎన్నుకున్నారు. ఒక ప్రాజెక్టు కమిటీ పరిధిలో ఇద్దరు చైర్మన్ల అవసరం ఏమిటో.. వారి విధి విధానాలు, బాధ్యతలు ఏమిటో ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీకి అమలాపురం, తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ కాకినాడ కలెక్టరేట్లలో శనివారం ఎన్నికలు నిర్వహించారు.

గోదావరి మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా పి.గన్నవరం డీసీ గుబ్బల శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. ఆయన నీటి సంఘాలకు పూర్తిగా కొత్త. తొలుత ఈ పదవికి కాట్రేనికోన డీసీ ఆకాశం శ్రీనివాస్ పేరు తెర పైకి వచ్చింది. గతంలో డీసీగా పని చేసిన అనుభవం కూడా ఉండడంతో పాటు సామాజిక సమీకరణాల్లో కూడా ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. శుక్రవారం రాత్రి వరకూ శ్రీనివాస్ పేరు వినిపించగా, రాజోలు, పి.గన్నవరం జనసేన ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ పట్టుబట్టి పి.గన్నవరం డీసీ గుబ్బల శ్రీనివాస్‌ను ఎంపిక చేయించారు. రాజోలు నుంచి సొంత పార్టీకి చెందిన పినిశెట్టి బుజ్జి ఉన్నప్పటికీ సామాజిక సమీకరణల పేరుతో ఆయనను పక్కన పెట్టారు. ఆకాశం శ్రీనివాస్‌ను వైస్ చైర్మన్ పదవికి ఎంపిక చేసి పంపించారు. అయితే అమరావతి నుంచి వచ్చిన జాబితాలో శ్రీనివాస్ స్థానంలో కరుటూరి నర్సింహరావు పేరు రావడం గమనార్హం. ఈయన సైతం నీటి సంఘాలకు కొత్త. లోకేష్ ద్వారా చెప్పించుకుని తెర పైకి రావడంతో శ్రీనివాస్‌కు మొండిచేయే ఎదురైంది.

గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) డీసీ మురాలశెట్టి సునీల్ కుమార్ (జనసేన) ఎంపిక కాగా, వైస్ చైర్మన్‌గా అనపర్తి డీపీ తమలంపూడి సుధాకర్‌రెడ్డి (టీడీపీ) ఎన్నికయ్యారు. వీరిద్దరూ నీటి సంఘాలకు కొత్త కావడం విశేషం. ఈ ప్రాంతంలో కొమరిపాలెం, కోటిపల్లి, కూళ్ల డీసీలుగా ఎంపికైన కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, దాట్ల వెంకట రాజగోపాలరాజు, మేకా శివ ప్రసాద్‌లకు గతంలో నీటి సంఘాల్లో పని చేసిన అనుభవం ఉంది. కొత్తగా ఎన్నికైనవారికి ఆ అనుభవం కూడా లేకపోవడం గమనార్హం.

దాట్ల మాటకు దక్కని ప్రాధాన్యం

తన పరిధిలో మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి వచ్చేలా ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బారాజు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఆకాశం శ్రీనివాస్‌కు చైర్మన్, వైస్ చైర్మన్ పదవి రాకపోవడంతో పాటు తన నియోజకవర్గం పరిధిలో తాళ్లరేవు డీసీ వేగేశ్న భాస్కర రాజుకు తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ పదవికి పట్టుబట్టినా ఫలితం లేకపోయింది.

ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా బస్వా

పెద్దాపురం: స్థానిక ఏలేరు ఇరిగేషన్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహించారు. కిర్లంపూడి మండలం ముక్కొల్లు గ్రామానికి చెందిన బస్వా వీర వెంకట నాగేంద్ర (టీడీపీ) చైర్మన్‌గా, పిఠాపురానికి చెందిన ఊటా ఆదివిష్ణు (జనసేన) వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కాడా) చైర్మన్ తుమ్మల రామస్వామి అభినందించారు.

ఉత్సాహంగా టీటీ పోటీలు



టేబుల్ టెన్నిస్‌లో పోటీపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడ సురేష్ నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. 15, 17, 19 ఏళ్లలోపు బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు జరిగాయి. శ్రీప్రకాష్ స్కూల్ డైరెక్టర్ విజయ్ ప్రకాష్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘ కార్యదర్శి మోహన్ బాబు పోటీలను పర్యవేక్షించారు. 15 ఏళ్లలోపు బాలబాలికల విభాగంలో కాకినాడ జిల్లా జట్టు తూర్పు గోదావరి జట్టుపై విజయం సాధించింది. 17 ఏళ్ల లోపు బాలబాలికల సెమీఫైనల్స్‌లో శాంతి జ్యోతిపై హాసిని, పి.జ్ఞాపికపై శ్రీపావని, బాలుర విభాగంలో హార్దిక్ రామ్‌పై టి.సామవేద్, లోహిత్‌పై విజయధర్ విజయం సాధించారు. 19 ఏళ్లలోపు బాల బాలికల విభాగంలో గుణ సంయుక్తపై వైష్ణవి సూర్య, ఈశా సంజనపై పి.హాసిని, బాలుర విభాగంలో పవన్ సత్యపై మణికుమార్, ఎం.ప్రజ్ఞాన్‌పై పి.మహిధర్ వర్మ విజయం సాధించారు.

క్లుప్తంగా

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని నయంత విశ్వ విద్యాలయం సీఈఓ ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ 4వ స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కృషి చేసినప్పుడే గొప్ప విజయాలు సొంతమవుతాయన్నారు. సెంచూరియన్ వర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్‌రావు విద్యార్థులు సాధించిన విజయాలను ప్రశంసించారు. వర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. వీసీ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ శక్తివంతమైన విద్యార్థులను సమాజానికి అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీలు, పీహెచ్‌డీలు, స్వర్ణ పతకాలు, ప్రోత్సాహకాలను అందజేశారు.

సాగునీటికి సమగ్ర కార్యాచరణ

- రబీలో ప్రతి ఎకరాకూ నీరు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- జెడ్పీటీసీలకు ప్రొటోకాల్ తప్పనిసరి
- అధికారులకు జెడ్పీ చైర్మన్ విప్పర్తి ఆదేశం
- వివిధ శాఖల అంశాలపై జెడ్పీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, చిత్రంలో కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

కాకినాడ సిటీ: రానున్న రబీ సీజన్‌లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇందుకు క్షేత్ర స్థాయి పరిస్థితులపై అవగాహనతో పూర్తి స్థాయిలో ప్రణాళికాబద్ధమైన కార్యచరణ రూపొందించాలని వివిధ శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేసింది. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయం, వైద్య, ఆరోగ్యం తదితర శాఖలపై అజెండా ప్రకారం సమీక్షించారు. వ్యవసాయంపై జరిగిన చర్చలో ప్రజాప్రతినిధులు ఏలేరు, గోదావరి కాలువలకు రబీలో పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి పనులను రైతులు మొదలుపెట్టారని అధికారులు నివేదించారు. రబీ సీజన్‌లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు చైర్మన్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. రబీలో గోదావరి, ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు కింద ఉన్న రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు సభ్యులకు వివరించారు.

ఈ సందర్భంగా చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు నేరుగా సంబంధం ఉన్న ఏకైక పంచాయతీరాజ్ వ్యవస్థ అన్నారు. జెడ్పీ సభ్యులు తమ పరిధిలోని ప్రజా సమస్యలను మండల, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో అన్ని పీహెచ్‌సీ, అర్బన్ యూపీహెచ్‌ల ద్వారా నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు సరిపడా మందులు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని సభ్యులు కోరారు. జెడ్పీటీసీ సభ్యులు తమ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన 50 శాతం బిల్లులను జనవరి మొదటి వారం నుంచి తమ బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని, మిగిలిన 50 శాతం మార్చి నాటికి విడుదల చేస్తామని చైర్మన్ తెలిపారు. మండల, గ్రామస్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలపై ప్రొటోకాల్ ప్రకారం జెడ్పీటీసీ సభ్యుల పేర్లు కచ్చితంగా ఉంచాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు జరిగే జిల్లా సర్వసభ్య సమావేశానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అన్ని జిల్లాల అధికారులు విధిగా హాజరై ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఎమ్మెల్సీ ఐవీ రావు మాట్లాడుతూ జిల్లా పరిషత్ పరిధిలోని జెడ్పీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సకాలంలో అందించాలన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు మాట్లాడుతూ వ్యవసాయ ఇరిగేషన్, డ్రైనేజీ కాలువలలో పరిశ్రమలు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను విడుదల చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ సామాన్యుడికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రయోజనం చేకూర్చేలా చూడాలన్నారు. ఇసుక ర్యాంపుల వద్ద సరిహద్దులు దాటి తవ్వడం, రాత్రి 9 గంటల వరకు లోడింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి హాజరయ్యే సభ్యుల సమయం వృథా కాకుండా గత సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదికలు అందచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, వైస్ చైర్‌పర్సన్ మెరుగు పద్మలత, సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో రామ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు జగన్ నాంది


జెడ్పీ బంగ్లాలో జగన్ పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ అనంతబాబు, జెడ్పీటీసీలు

జెడ్పీ చైర్మన్ విప్పర్తి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి నిరుపమానమైన సేవలు అందించారని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. చంద్రబాబు మాదిరిగా కాకుండా అమలు చేయగలిగే హామీలను మాత్రమే ప్రజలకు ఇచ్చిన చిత్తశుద్ధి కలిగిన ఏకైక నాయకుడు జగన్ అన్నారు. కాకినాడ జెడ్పీ బంగ్లాలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని జిల్లా పరిషత్ సభ్యుల సమక్షంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ నేతల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేసి పంచారు. ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి అలవి కాని హామీల జోలికి పోకుండా సాగిన జగన్ సంక్షేమ పాలన తిరిగి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

అప్పులు తీర్చేందుకే దోపిడీ యత్నం

- చెడు సావాసాలు.. బెట్టింగులతో తప్పుడు దారి
- జ్యూయలరీ షాపు దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్
- ఒకరు ప్రభుత్వ సర్వేయర్.. మరొకరు సాఫ్ట్‌వేర్ నిపుణుడు
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీహరి రాజు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరిరాజు, పక్కన సీఐ సూరి అప్పారావు, ఎస్ఐ శ్రీహరిబాబు


దోపిడీకి పాల్పడిన నిందితులు ఉద్దగిరి అఖిల్, మామిడి రాజు


నిందితులు సంచిలో పెట్టిన బంగారు ఆభరణాలు

అన్నవరం: స్థానిక జీవన జ్యూయలర్స్‌లో దోపిడీ యత్నం ఘటన వివరాలను డీఎస్పీ డి.శ్రీహరిరాజు శనివారం అన్నవరం పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. ఈ కేసులో నిందితులు ఉద్దగిరి అఖిల్, మామిడి రాజు శుక్రవారం అర్ధరాత్రి అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల స్వస్థలం తొండంగి మండలం ఏ కొత్తపల్లి. ఇద్దరి వయసు 24 ఏళ్లు, వీరిలో అఖిల్ తొండంగి మండలం, సీతారామపురం సచివాలయంలో విలేజి సర్వేయర్ కాగా, మామిడి రాజు సాఫ్ట్‌వేర్ కంపెనీలో కొంత కాలం పనిచేశాడు. వారు వ్యసనాలకు, బెట్టింగులకు బానిసలై అప్పుల పాలై వాటిని తీర్చేందుకు దొంగతనం చేయాలని అన్నవరంలోని జీవన జ్యూయలర్స్‌లో రెండు సార్లు రెక్కీ నిర్వహించారు.

తునిలో పరికరాల కొనుగోలు

దొంగతనం చేయాలని నిర్ణయించినదే తడవుగా తునిలోని డీమార్ట్‌లో రెండు చిన్న కత్తులు, ఒక సుత్తి, ఆశీర్వాద్ కారంపొడి, తాడు కొనుగోలు చేశారు. అలాగే రెయిన్ కోట్లు, హెల్మెట్లు ధరించి నెంబర్ ప్లేట్ లేని స్కూటీపై శుక్రవారం సాయంత్రం జీవన జ్యూయిలరీ షాపునకు వచ్చి మొదట ఆ షాపు యజమాని వరదా లక్ష్మణరావు, ఆ తరువాత వారి బంధువు మంగరాజు, యజమాని భార్య రాజేశ్వరిపై సుత్తితో దాడి చేసి గాయపరిచారు. షో రూమ్ లోని కేజీన్నర బంగారు ఆభరణాలను వారు తెచ్చుకున్న సంచిలో వేసుకున్నారు. ఇంతలో దుకాణం యజమాని, అతని భార్య, వారి బంధువుల కేకలకు స్థానికులు రావడంతో పారిపోయే ప్రయత్నంలో వారికి దొరికిపోయారు. ఆధారాలు దొరకకూడదని హెల్మెట్‌కు గల కంపెనీ స్టిక్కర్‌సైతం తొలగించారు. కాగా దుకాణంలో సీసీ టీవీ ఏర్పాటు చేసుకున్నప్పటికీ దుకాణం తెరిచినపుడు మాత్రమే ఆన్‌చేసి మధ్యాహ్నం భోజన విరామ సమయంలో, రాత్రి వేళల్లో ఆఫ్ చేస్తున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలినట్టు డీఎస్పీ వివరించారు.

వేట్లపాలెం హత్యల కేసులో మరో 10 మంది అరెస్టు

సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో సంచలనం సృష్టించిన హత్యలకు సంబంధించి మరో 10 మందిని అరెస్టు చేసినట్లు సీఐ ఎ.కృష్ణభగవాన్ శనివారం రాత్రి తెలిపారు. ఈనెల 15వ తేదీ ఆదివారం రాత్రి కర్షాల చంద్రరావు, ప్రకాశరావు, ఏసుబాబులను కొందరు కత్తులతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే 12 మందిని అరెస్టు చేశారు. కాగ శనివారం సామర్లకోట మండలం, హుస్సేన్‌పురం గ్రామంలో శ్రీరామకృష్ణ ఫైర్ వర్క్స్ సమీపంలో బచ్చల రాజ్‌కుమార్, బచ్చల చంద్రరావు, గుల్ల సునీల్‌కుమార్, సికోటి రాజేంద్రప్రసాద్, గుడాల సన్నిబాబు, బచ్చల జార్జి, తోలేటి రాంబాబు, గుడాల వినోద్‌కుమార్, కోళ్ల రాజు, బచ్చల లక్షణ్‌లను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. దాంతో ఇప్పటి వరకు 22 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు కత్తులు, ఐదు కర్రలు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు

సామర్లకోట: రావులపాలెంలో ఆదివారం నుంచి జరగనున్న 50వ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు బాలుర, బాలికల జట్లను ఎంపిక చేసినట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 13 నుంచి కాకినాడ పీఆర్ కళాశాల మైదానంలోని ఇండోర్ కోర్టులో ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి ఉత్తమ ప్రతిభ చూపిన వారిని జట్లకు ఎంపిక చేసినట్టు తెలిపారు. వారు ఆదివారం నుంచి 25 వరకు జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర కబడ్డీ విశ్రాంత కోచ్ పోతుల సాయిప్రసాద్, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు క్రీడాకారులను ఎంపిక చేశారన్నారు. జట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

బాలికల జట్టు: జి.పావని, ఎం.మానస, ఎస్.నాగమణి, కె.అషిక, కె.జీవన జ్యోతి, పూర్ణశ్రీ ప్రవణిక, ఎంవీడీ మహాలక్ష్మి, పి.రేఖ నాగసాయి, జి.సత్య శ్రీవల్లీ, బి.మంజులరాణి, బి.నాగపల్లవి, ఎ.గ్రీష్మవర్ధని

బాలుర జట్టు: వి.ప్రవీణ్‌కుమార్, ఎస్.అవినాష్, జి.గంగబాబు, వి.వీరచక్ర, ఆర్.సాయిరామ్, బి.ఎలిషా, పి.అనిల్‌కుమార్, ఎస్.చక్రధర్, ఎస్.వంశీ, ఒ.ధర్మారావు, ఇ.శ్యామ్ నాగేంద్ర, జి.చందు.